సాక్షి
అనంతపురం
మంగళవారం । 17 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



సెంట్రల్‌లో సరికొత్త కోర్సులు

జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సరికొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. 8లో

గరిష్టం/కనిష్టం
34.9°/23.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పడిగాపుల 'సుఖీభవ'



కూడేరు రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న వృద్ధులు, మహిళా రైతులు

కూడేరు: ఈ–కేవైసీ చేయించుకోవడానికి సర్వర్ సరిగా పని చేయకపోవడంతో సోమవారం రైతులు పడిగాపులు కాశారు. కడదరకుంట, కూడేరుకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో స్థానిక రైతు సేవా కేంద్రానికి చేరుకున్నారు. ఈ–కేవైసీ చేయించుకుంటేనే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని చెప్పడంతో మహిళలు, నడవలేని వారు, వృద్ధులు సైతం వచ్చి పడిగాపులు కాశారు. వృద్ధులు, మహిళలు రైతు సేవా కేంద్రం ముందు వరండాలో నేలపై పడుకున్నారు. అయితే.. చావు కబురు చల్లగా చెప్పినట్లుగా మధ్యాహ్నం 2 గంటల తర్వాత సిబ్బంది ఒక ప్రకటన చేశారు. 'ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి.. వేలిముద్రతో ఈ–కేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు. 18న జాబితా వస్తుంది.. అందులో పేర్లు వస్తే సమాచారమిస్తాం' అని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు.

టీబీ డ్యాంలో 28 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ ద్వారా తాగు, సాగు నీరందించే కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి 12,278 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కొన్ని రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో మొదలైంది. 10 రోజులుగా వరద డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,604.49 అడుగులకు నీరు చేరుకుంది. మొత్తం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 28 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1,583.03 అడుగుల వద్ద 6.105 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. 1,619 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 577 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి: ఎస్పీ



పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లకు పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సందర్భంగా సోమవారం 97 పిటీషన్లు స్వీకరించారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ–ఆస్తి వివాదాలు, రస్తా తగాదాలపై ఫిర్యాదుదారులు విన్నవించుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని.. వాటి పూర్వాపరాలపై విచారణ చేసి చట్ట పరిధిలో తగిన పరిష్కారం చూపాలన్నారు. పిటీషన్లపై తీసుకున్న చర్యలకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదికలు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా విభాగం డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ నవీన్‌కుమార్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో ఉన్న డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు కడపకు బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆ స్థానానికి రెగ్యులర్ అధికారిని ఇప్పటి వరకూ ప్రభుత్వం నియమించకపోవడంతో ఇన్‌చార్జ్‌గా డాక్టర్ నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది.

నిబంధనాలు.. పంగనామాలు





❐ ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు మలిరెడ్డి. అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామం. ఈయనకు ముగ్గురు పిల్లలు. ఒకరు ఒకటో తరగతి, మరొకరు 9వ తరగతి, ఇంకొకరు 10వ తరగతి.మలిరెడ్డికి ఏడెకరాల భూమి ఉంది. 'తల్లికి వందనం' కింద ముగ్గురు పిల్లలకు కలిపి రూ. 39 వేలు రావాల్సి ఉంది. మలిరెడ్డికి పదెకరాలకు పైగా మెట్ట భూమి ఉందని అనర్హుల జాబితాలో చేర్చారు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు 'అమ్మ ఒడి' పథకం అందడం గమనార్హం.



❐ ఇతని పేరు గొల్ల ఆనంద్‌కుమార్. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి. ఈయనకు 9వ తరగతి చదువుతున్న కూతురు, 10వ తరగతి చదువుతున్న కుమారుడు సంతానం. ఆనంద్ కుమార్‌కు 6.81 ఎకరాల భూమి ఉంది. అయితే 10 ఎకరాలకు పైగా మెట్టభూమి ఉందని చూపిస్తూ 'తల్లికి వందనం' అనర్హుల జాబితాలో ఉంచారు. ఆ తక్కిన 3.5 ఎకరాల భూమి ఎక్కడుందో అధికారులు చూపించాలని గొల్ల ఆనంద్‌కుమార్ కోరుతున్నాడు.

కొందరికే 'వందనం'

- 'తల్లికి వందనం' అమలులో అనేక కొర్రీలు
- జిల్లాలో లక్షమందికి పైగా విద్యార్థులకు కోత
- గ్రామాల్లో కక్షకట్టి మరీ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను అనర్హుల జాబితాలో చేర్చిన వైనం
- గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



అన్ని అర్హతలున్నా 'తల్లికి వందనం' అందలేదంటూ సోమవారం అనంతపురంలోని వినాయకనగర్ సచివాలయానికి వచ్చిన మహిళలు

అనంతపురం ఎడ్యుకేషన్: సవాలక్ష కొర్రీలతో 'తల్లికి వందనం' పథకాన్ని పేదలకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తోంది. అన్ని అర్హతలున్నా జిల్లాలో చాలా మందిని అనర్హుల జాబితాల్లో చేర్చింది. కూలీనాలీ చేసుకునే కుటుంబాలను సైతం ప్రతినెలా 300 యూనిట్ల కరెంటు ఖర్చు చేస్తున్నారు అంటూ పక్కనపెట్టారు. ఏసీ, ఫ్రిజ్, కూలర్లు, టీవీలు, మూడు ఫ్యాన్లు ఉన్నవారికి కూడా అన్ని యూనిట్లు కాలడం లేదని, ఫ్యాన్లు, టీవీ ఉన్న తమలాంటి కుటుంబాలు అన్ని యూనిట్ల కరెంటు ఎలా ఖర్చు చేస్తామంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. అలాగే అద్దె వాహనాలకు వెళ్తుంటే నాలుగు చక్రాల వాహనాలున్నాయంటూ ఎగరగొట్టేందుకు చూస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పట్టణాల్లో రూ. 12 వేలు, గ్రామాల్లో రూ. 10 వేలకు మించి ఆదాయం ఉన్న వారందరికీ 'ఉఫ్' అనిపించారు. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు 4,13,160 మంది దాకా ఉన్నారు. వీరిలో అనర్హులను పక్కన పెడితే... అర్హత ఉన్నవారే లక్ష మందికి పైగా 'తల్లికి వందనం' అందుకోలేదు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారుల వద్ద ఎలాంటి జాబితాలు లేవు. ఎంతమంది విద్యార్థులున్నారు, అర్హులు, అనర్హులు ఎంతమంది అనే ప్రాథమిక వివరాలు వారి వద్ద లేకపోవడం గమనార్హం.

అప్పుడు అర్హతే ప్రామాణికం...

గత ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూటమి పార్టీలకు అనుకూలంగా ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరీ ముఖ్యంగా గ్రామాల్లో కక్ష కట్టి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను అనర్హుల జాబితాల్లోకి చేర్చుతున్నారని బాధితులు వాపోతున్నారు. 'అమ్మఒడి' పేరుతో ఇంట్లో ఒకరికి మాత్రమే డబ్బులిస్తున్నారు. అదికూడా రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 13 వేలు ఇస్తున్నారు. మేం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది అంటే అందరికీ 'తల్లికి వందనం' పథకం కింద రూ. 15 వేలు ఇస్తాం' అంటూ గత ఎన్నికల ముందు ప్రతి మీటింగ్‌లోనూ ఊదరగొట్టిన చంద్రబాబు, లోకేష్‌తో పాటు పవన్‌కల్యాణ్ ఇప్పుడు నిబంధనల పేరిట కొర్రీలు వేయడంపై పేదలు మండిపడుతున్నారు.



తనకు రెండున్నర ఎకరాల భూమి ఉంటే ఆన్‌లైన్‌లో 13 ఎకరాలు చూపిస్తోందని చెబుతున్న శ్రావణి

కక్ష కట్టారు..



నేను ఇళ్లలో పనులు చేస్తుంటా. నా భర్త నాగరాజు ప్లంబింగ్ పనులకు వెళ్తాడు. మాకు 8వ తరగతి చదువుతున్న కుమార్తె, ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. 'తల్లికి వందనం' జాబితాలో పిల్లల పేర్లు లేవు. నా భర్త గతంలో పంచాయతీ కార్యాలయంలో పని చేస్తుండేవాడు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కక్ష కట్టి మరీ విధుల నుంచి తప్పించారు.

– చిలమకూరి లక్ష్మీదేవి, కక్కలపల్లి గ్రామం, అనంతపురం రూరల్ మండలం

వందలాది మందికి మోసం

నా ముగ్గురు పిల్లలూ తల్లికి వందనం పథకానికి అర్హులే. అయితే ఇంట్లో ఆదాయపు పన్ను చెల్లించేవారు ఉన్నారనే సాకుతో అనర్హుల జాబితాలో ఉంచారు. ఇలా ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో ఉన్నారు. నగరపాలక సంస్థ డివిజన్లు, మునిసిపాల్టీల్లోని వార్డుల్లో వందలాది మంది అనర్హుల జాబితాలో ఉన్నారు.

– మొహిద్దిన్, పాపంపేట, అనంతపురం రూరల్ మండలం

ముక్కుపిండి పన్ను వసూలు చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో పన్ను చెల్లించని వారిని గుర్తించి ముక్కుపిండి వసూలు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్ల లక్ష్యం అధిగమించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో 32 వేల మంది ట్యాక్స్ పేయర్స్ ఉన్నారన్నారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ 50 శాతం రావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఐఎంఏ, లా అసోసియేషన్ తదితర వాటికి లేఖ రాయాలన్నారు. పన్ను వసూళ్లపై నెలవారీగా నివేదిక అందించాలన్నారు. టీడీఎస్ గురించి జిల్లా అధికారులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పన్ను వసూళ్లు పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శేషాద్రి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరికి జైలు



సోమందేపల్లి: కర్ణాటక మద్యం విక్రయించిన కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. 2022లో పత్తికుంటపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆంజనేయులు, ఓబులేస్‌పై సోమందేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పెనుకొండ కోర్టులో కేసు విచారణ జరిగింది. సోమవారం తుది విచారణ అనంతరం మద్యం విక్రేతలిద్దరికీ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

టీచర్ల బదిలీలు @7,152

- అనుకూలమైన చోటుకు 'స్వాప్ బదిలీలు'
- కమిషనర్ ఆదేశాలు తుంగలోకి



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,152 మంది ఉపాధ్యాయులు బదిలీలయ్యారు. వీరిలో గ్రేడ్–2 హెచ్‌ఎంలు 133 మంది, పీఎస్‌హెచ్‌ఎంలు 193 మంది, స్కూల్ అసిస్టెంట్లు 3,478 మంది, ఎస్జీటీలు 3,208 మంది, పండిట్లు 111 మంది, పీఈటీలు 29 మంది ఉన్నారు. తప్పనిసరి బదిలీలు, రీఆపోర్షన్, ఫారెన్ సర్వీస్, బాలికల పాఠశాలల్లో పురుష టీచర్లు పని చేస్తున్న ఖాళీలు, వివిధ డిగ్రీలు చేసేందుకు సెలవులో వెళ్లిన టీచర్ల స్థానాల్లో ఏర్పడిన ఖాళీలు, అనధికార గైర్హాజరుతో ఏర్పడిన ఖాళీలన్నీ భర్తీ చేశారు.

బదిలీ అయిన టీచర్లు సబ్జెక్టుల వారీగా...

లాంగ్వేజ్ పండిట్ (హిందీ) 14 మంది, కన్నడ 1, తెలుగు 87, ఉర్దూ 9 మంది బదిలీ అయ్యారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(తెలుగు) 29 మంది, పీఎస్‌హెచ్‌ఎం కన్నడ 1, తెలుగు 191, ఉర్దూ 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 511, హిందీ 238, కన్నడ 1, సంస్కృతం 7, తెలుగు 386, ఉర్దూ 16, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ తెలుగు 510, ఉర్దూ 6, కన్నడ 2, స్కూల్ అసిస్టెంట్ గణితం (తెలుగు) 647, ఉర్దూ 10, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ తెలుగు) 188, ఫిజికల్ సైన్స్ (తెలుగు) 518, ఉర్దూ 6, సోషల్ (తెలుగు) 415, ఉర్దూ 3, స్పెషల్ ఎడ్యుకేషన్ (తెలుగు) 14, ఎస్జీటీ (తెలుగు) 3,142, ఉర్దూ 54, కన్నడ 12 మంది టీచర్లు బదిలీ అయ్యారు.

కమిషనర్ ఆదేశాలు తుంగలోకి..

స్వాప్ బదిలీల అంశంలో కమిషనర్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తున్నామంటూ చెప్పిన అధికారులు, ఉద్యోగులు కొందరి విషయంలో 'అయిన వారికి ఆకులో కానివారికి కంచంలో' అన్న చందంగా వ్యవహరించారు. కొందరినైతే స్వాప్ పని చేస్తున్న పాఠశాలలో ఖాళీగా ఉంటే భాగస్వామిని కూడా అక్కడికే పంపారు. పుట్లూరు మండలం కడవకల్లులో గణితం టీచరు పీఎస్‌హెచ్‌ఎంగా పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నెకు వెళ్లారు. ఈయన స్పౌజ్ సర్టిఫికెట్ కడవకల్లులో పని చేస్తున్నదే ఇచ్చారు. ఆ ప్రకారం గణితం టీచరుగా ఉన్న ఆయన భార్య పుట్లూరు మండలానికి వెళ్లాలి. లేదా బదిలీ అయిన పెద్దపప్పూరు మండలానికి వెళ్లాలి. ఈ రెండుకాదని మండల కేంద్రం ఆత్మకూరుకు పంపారు. గార్లదిన్నె మండలంలో పని చేస్తున్న ఓ టీచరు భార్య కూడా నిబంధనలకు విరుద్ధంగా నార్పల మండలానికి వెళ్లారు.

584 మందికి పదోన్నతులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 584 మంది వివిధ కేడర్ల టీచర్లకు పదోన్నతులు కల్పించారు. వీరిలో గ్రేడ్–2 హెచ్‌ఎంలు 153 మంది, మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎంలుగా కన్నడ 1, తెలుగు 130, ఉర్దూ 10 ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 46, హిందీ 1, తెలుగు 1, ఉర్దూ 1, గణితం (తెలుగు) 81, గణితం (ఉర్దూ) 5, పీఎస్ (తెలుగు) 46, పీఎస్ (ఉర్దూ) 1, పీఎస్ (కన్నడ) 01, బీఎస్ (తెలుగు) 39, బీఎస్ (ఉర్దూ) 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) తెలుగు 6, సోషల్ (తెలుగు) 50, సోషల్ (ఉర్దూ) 06, సోషల్ (కన్నడ) ఇద్దరికి పదోన్నతులు కల్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యాడికి: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం యాడికి మండల కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, డీఆర్‌ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 461 వినతులు అందాయి. అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పదేపదే సమస్యలతో ప్రజలు రాకూడదని, ఇక నుంచి క్షేత్ర స్థాయి అధికారులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాడికి మండల తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డీటీ శ్రీనివాసులు, ఆర్‌ఐ కిట్టప్ప, ఎంపీడీఓ వీర్రాజు, ఏఓ మహబూబ్ బాష, ఎంఈఓలు కాశెప్ప, ధనలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- యాడికి కాలువకు, రాయలచెరువు చెరువుకు పూర్తి స్థాయిలో నీటిని అందించి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, రమేష్ నాయుడు దంపతులు, ఎంపీటీసీ నాగరాజు వినతి పత్రం అందజేశారు.
- రాయలచెరువు గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు కుమారుడు రవి కుమార్ నాయుడు 3 సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం రూ.6 వేలు మాత్రమే పింఛన్ వస్తోందని, ఇంకా పెంచేట్లు చూడాలని కలెక్టర్‌ను బాధితులు వేడుకున్నారు.
- యాడికి మండల కేంద్రంలోని కాలువకు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ శాసన సభ్యులు కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి పేరు పెట్టాలని సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు.

పాలకుల నిర్లక్ష్యం.. ప్రాణ సంకటం

- గుంతకల్లు ఆస్పత్రిలో దుస్థితి
- డయాలసిస్ రోగులకు విద్యుత్ కష్టాలు
- దిక్కు లేని ఎమ్మెల్యే హామీ



సోమవారం ఉదయం 12 గంటలైనా గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా డయాలసిస్ బెడ్లు

గుంతకల్లు: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందాన తయారైంది గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి పరిస్థితి. పేరుకు 100 పడకల ఆస్పత్రి అయినా రోగులకు సరిగా సేవలు అందడం లేదు. పాలకులు పట్టించుకోకపోవడంతో పరిస్థితులు రోజురోజుకూ మరింత అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. ముఖ్యంగా ఆస్పత్రిలో కిడ్నీ రోగులు నరకం అనుభవించాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో రూ. 50 లక్షలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. 8 మిషన్లు సమకూర్చారు. స్థానికులతో పాటు కర్నూలు జిల్లా పత్తికొండ, ఆలూరుకు చెందిన 51 మంది కిడ్నీ రోగులు ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నారు. పరిస్థితిని బట్టి వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఆస్పత్రిలో రోజూ 18 మంది దాకా డయాలసిస్ చేయించుకుంటారు. కిడ్నీలు సరిగా పనిచేయని రోగులకు డయాలసిస్ ఎంతో ముఖ్యం. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఒక్కో రోగికి 3 గంటల నుంచి 4 గంటల సమయం పడుతుంది. సమయానికి డయాలసిస్ చేయించుకోవడంలో ఏ మాత్రం జాప్యం జరిగినా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

కరెంటు లేక నరకం..

సోమవారం ఉదయం 9 గంటల్లోపే డయాలసిస్ చేయించుకోవాల్సి ఉండటంతో ఆ సమయానికే పలువురు కిడ్నీ బాధితులు గుంతకల్లు ఆస్పత్రికి వచ్చారు. అయితే, అప్పటికి ఆస్పత్రిలో కరెంట్ లేకపోవడం..డయాలసిస్ మిషన్లు పనిచేయకపోవడంతో నరకం చూడాల్సి వచ్చింది. ప్రాణ భయంతో వణికిపోతున్న తమ వారిని చూసి సహాయకులు అల్లాడిపోయారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కరెంటు రావడంతో ఊపిరి లేచివచ్చినట్లయింది. గుంతకల్లు ఆస్పత్రిలో విద్యుత్ కోతలు, సరఫరా లోపాలను అధిగమించేందుకు కొన్ని నెలల క్రితం కొత్తగా జనరేటర్‌ను ఏర్పాటు చేసినా.. దానికి అనుసంధానంగా వైరింగ్ మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో కరెంట్ ఇబ్బందులు షరామామూలుగా మారాయి. ఒక్కోసారి డయాలసిస్ చేయించుకోనే సమయంలో కూడా కరెంట్ పోతోందని, అప్పుడు తాము పడే బాధ వర్ణనాతీతంగా ఉంటోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

గుమ్మనూరు హామీ.. నెరవేరదేమి?

ఈ ఏడాది జనవరి 5న గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో ఎమ్మెల్యే దృష్టికి ప్రభుత్వ ఆస్పత్రి యాజమాన్యం పలు సమస్యలను తీసుకెళ్లింది. ప్రధానంగా ఆస్పత్రిలో జనరేటర్‌కు వైరింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించగా.. స్పందించిన ఆయన త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ, 5 నెలలు పూర్తయినా ఇప్పటికీ అతీగతి లేకుండా పోయింది.

అల్లాడిపోతున్నాం..



షుగర్ పేషెంట్లకు ఓపిక చాలా తక్కువ. వారంలో రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవడానికి గుత్తి నుంచి ఇక్కడకు వస్తున్నా. వచ్చిన ప్రతి సారి కరెంట్ కోతల కారణంగా ఇబ్బందులకు గురవుతున్నా. ఆస్పత్రిలో జనరేటర్ పనిచేయకపోవడంతో కరెంట్ వచ్చే వరకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కోసారి డయాలసిస్ చేయించుకునే సమయంలో కూడా కరెంట్ పోతోంది.

– ఆద్రో, గుత్తి ఆర్ఎస్

3 గంటలు వేచి ఉన్నా..



వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు.అందులో భాగంగా సోమవారం ఉదయం 8.30 గంటలకే ఆస్పత్రికి చేరుకున్నా. అయితే కరెంట్ లేదు. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. డయాలసిస్‌కు వచ్చిన ప్రతి సారీ ఇలాగే జరుగుతోంది.

– బాలకృష్ణ, ములకలపెంట, గుంతకల్లు మండలం

ఎమ్మెల్యే హామీ నెరవేర్చాలి



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హామీ నెరవేర్చాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో జనరేటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. పేద రోగులను దృష్టిలో ఉంచుకొని బెడ్‌లను పెంచాలి. మరో టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రోజుకు నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ చేయాలి.

– బీ.శ్రీనివాసులు, సీపీఎం నాయకుడు, గుంతకల్లు

సెంట్రల్‌లో సరికొత్త కోర్సులు

- ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా 15 డిప్లొమా కోర్సులు
- ఇప్పటికే ముగిసిన సీయూ సెట్
- మిగులు సీట్ల భర్తీకి మరో అవకాశం
- జూలై చివరి వరకూ ప్రవేశాలకు గడువు
- యూజీలో 9, పీజీలో 17 కోర్సులు అందుబాటులోకి
- ఆరు విభిన్న కోర్సుల్లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం


సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

అనంతపురం: నాణ్యమైన ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా నిలిచిన అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సరికొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రవేశ పరీక్ష ద్వారా దేశ వ్యాప్తంగా 14 సెంట్రల్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందే అవకాశముంది. ఇప్పటికే సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెస్ టెస్ట్ (సీయూ సెట్)కు గడువు ముగిసింది. అయితే సీయూ సెట్ ద్వారా సీట్లు భర్తీ కాగా, మిగులు సీట్ల భర్తీని వర్సిటీనే స్వతహాగా ఓ ప్రవేశ పరీక్ష నిర్వహించి చేపడుతుంది.

క్యాంపస్ కళాశాలలో డిగ్రీ కోర్సులు..

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 9 యూజీ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. బీఏ ఆనర్స్ కింద పొలిటికల్ సైన్సెస్ విభాగంలో 40 సీట్లు, ఇంగ్లిష్ విభాగంలో 25, బీబీఏలో 60, బీకాం ఆనర్స్‌లో 40, బీఎస్సీ ఆనర్స్ కింద ఎకనామిక్స్ విభాగంలో 25, ఆర్ఎంఐటీలో 25, సైకాలజీలో 30, సీఎస్ అండ్ ఏఐలో 60, బీటెక్ (సీఎస్ఈ)లో 60 సీట్లు భర్తీ చేస్తారు. ఇక పీజీలో ఎంఏలో ఇంగ్లిష్ విభాగానికి 30 సీట్లు, హిందీ విభాగానికి 20, గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీలో 20, పొలిటికల్ సైన్సెస్‌లో 30, తెలుగులో 20 సీట్లు కేటాయించారు. అలాగే ఎంబీఏకు 60, ఎంకాంలో 20, ఎమ్మెస్సీలో అప్‌లెడ్ సైకాలజీ విభాగంలో 40, ఏఐ అండ్ డీఎస్‌లో 40, క్లినికల్ సైకాలజీ విభాగంలో 25, కంప్యూటేషనల్ సోషల్ సైన్స్‌లో 20, ఎకనామిక్స్‌లో 20, ఎకనామిక్స్ అండ్ డేటా అనాలసిస్‌లో 20, జియాగ్రఫీలో 25, మేథమేటిక్స్‌లో 30, మాలుక్యులార్ బయాలజీలో 30, స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీట్లు అందుబాటులో ఉంటాయి. పీహెచ్‌డీకి సంబంధించి పొలిటికల్ సైన్సెస్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ కోర్సు, తెలుగు, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులు ఉన్నాయి. పీహెచ్‌డీని ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసే సౌలభ్యం కూడా ఉంది.

గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా 2018లో అనంతపురం కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కాగా, ప్రస్తుతం బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శాశ్వత క్యాంపస్‌ను నెలకొల్పారు. రెండు అకడమిక్ బ్లాక్‌లు, ఒక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, రెండు బాయ్స్, ఒక గర్ల్స్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. ఓ ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్, మరో సోలార్ పార్క్‌తో ఆరు జోన్లలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటైంది. ప్రస్తుతం 2,400 మంది విద్యార్థులు చదువుతున్నారు. పది రాష్ట్రాలు.. ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. 75 మంది ప్రొఫెసర్లలో 50 శాతం మంది మహిళలే ఉండడం విశేషం. గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. యూపీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రోగ్రాం కూడా నిర్వహిస్తుండడంతో ఇక్కడి సెంట్రల్ యూనివర్సిటీలో చేరేందుకు పలువురు విద్యార్థులు పోటీ పడుతుంటారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా ఇప్పటికే ఇక్కడ చదువుకున్న 160 మంది విద్యార్థులకు పలు కంపెనీల్లో కొలువులు దక్కాయి.

కొత్తగా డిప్లొమా కోర్సులు..

సెంట్రల్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా 15 డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడాది కాల వ్యవధి ఉన్న డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

డిప్లొమా కోర్సుల వివరాలు..

- కంప్యూటేషనల్ సోషల్ సైన్సెస్
- జియో– స్పేషియల్ ఇన్ఫర్మేటిక్స్
- బయో ఇన్ఫర్మెటిక్స్ అండ్ డేటా సైన్సెస్
- పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్
- డిజిటల్ మార్కెటింగ్
- కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ (ట్యాలీ ఈఆర్‌పీ) విత్ జీఎస్టీ ఫైలింగ్
- సైబర్ సెక్యూరిటీ
- గ్రీన్ ఎనర్జీ అండ్ మేనేజ్‌మెంట్
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్
- బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్
- మేథమేటికల్ ఫౌండేషన్స్ ఫర్ మెషిన్ లర్నింగ్ అండ్ డేటా సైన్సెస్
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్
- సెమి– కండక్టింగ్ టెక్నాలజీ
- క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ మెషిన్ లర్నింగ్
- డిజైన్ థింకింగ్

సరికొత్త కోర్సులకు రూపకల్పన



సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా సరికొత్త కోర్సులకు రూపకల్పన చేశాం. డిప్లొమాలో 15 కోర్సులు అందుబాటులోకి తెచ్చాం. యూజీలోనూ బీటెక్, ఏఐ కోర్సులు ఉన్నాయి. పీజీలోనూ సరికొత్త కోర్సులు తీసుకొచ్చాం. గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈ విద్యా సంవత్సరంలోనూ అదే ఒరవడి కనిపిస్తోంది. – ఎస్.ఎ.కోరి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

క్లుప్తంగా

మార్కెటింగ్‌శాఖ ఏడీగా రాఘవేంద్రకుమార్



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఎం)గా కాకినాడలో పనిచేస్తున్న రాఘవేంద్రకుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేస్తున్న పి.సత్యనారాయణచౌదరి గుంటూరుకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం స్థానిక ఆ శాఖ ఏడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రకుమార్‌ను ఆ శాఖ ఉద్యోగులు, పలువురు మార్కెట్‌యార్డు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు అభినందించారు.

మద్యం తాగేందుకు డబ్బివ్వలేదని ఆత్మహత్య


గోపాల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

ధర్మవరం అర్బన్: మద్యం తాగేందుకు డబ్బివ్వలేదని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ధర్మవరంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్‌కాలనీకి చెందిన గుండు గోపాల్(57) తాగుడుకు బానిసయ్యాడు. అతని భార్య ప్రస్తుతం గర్భిణి కావడంతో కాన్పు ఖర్చుల కోసం రూ.10 వేలు దాచుకున్నారు. ఆ డబ్బు కావాలని భార్య, తల్లితో గోపాల్ గొడవ పడ్డాడు. వారు ఇవ్వకపోవడంతో క్షణికావేశానికి లోనయ్యాడు. కాలనీకి సమీపంలోని రైల్వే ట్రాక్ పైకి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీపీఆర్‌ఓగా బాలకొండయ్య


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పూలమొక్క అందజేస్తున్న డీపీఆర్‌ఓ బాలకొండయ్య

అనంతపురం అర్బన్: జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిగా (డీపీఆర్‌ఓ)గా బాలకొండయ్య, డీపీఆర్‌ఓగా రమణ, ఏపీఆర్‌ఓగా ఫక్రుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. డీపీఆర్‌ఓ బాలకొండయ్య, డీపీఆర్‌ఓ రమణ తిరుపతి నుంచి ఇక్కడికి, ఏపీఆర్‌ఓ ఫక్రుద్దీన్ శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

మహిళ నిజాయితీ


బంగారాన్ని అప్పగిస్తున్న లలిత

అనంతపురం: నగరంలో తనకు దొరికిన బంగారాన్ని సంబంధీకులకు ఓ మహిళ అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన చల్లా అనుదీప్, అతని కుటుంబసభ్యులు సోమవారం ఉదయం వారి కుమారుడికి మూడో రోడ్డులోని కృష్ణ మఠంలో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కృపానంద నగర్‌లోని ఇంటికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. కోర్టురోడ్డులోని ఐటీఐ మిట్ట వద్దకు చేరుకోగానే ఐదు తులాల నెక్లెస్ ఉంచిన బ్యాగ్ జారి కిందకు పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న నల్లప్పరెడ్డి కాలనీకి చెందిన లలిత ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగ్‌లో బంగారు నగను గుర్తించిన పోలీసులు విచారణ అనంతరం చల్లా అనుదీప్‌ను పిలిపించి లలిత చేతుల మీదుగా అప్పగించారు.

రచ్చ చేస్తాం.. రెచ్చిపోతాం

- అనంతపురంలో ఆగని దౌర్జన్యాలు
- ఒక్క కేసు నమోదు చేస్తే ఒట్టు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గం భూ ఆక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో అట్టుడుకుతోంది. ఏ రోజు ఎలాంటి గొడవలు జరుగుతాయో, ఎప్పుడేం జరుగుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొని ఉంది. స్థానిక ప్రజాప్రతినిధి దెబ్బకు సొంతపార్టీలోని వారే కంగుతింటున్నారు. టీడీపీలోనే రెండు గ్రూపులు కావడంతో ఏ గ్రూపు నుంచి ఎవరికి ఎటు నుంచి ముప్పు వస్తుందో తెలియడం లేదు.

రోజూ ఎక్కడో ఒక చోట భూ ఆక్రమణలు : నగరంలో ఖరీదైన ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు ప్రజాప్రతినిధి అనుచరులు కబ్జాలకు యత్నిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కియా షోరూం వెనకాల సుమారు 90 సెంట్ల ఖాళీ స్థలంపై కొందరి కన్ను పడింది. భూమి యజమానిపై దాడిచేశారు. ఓనర్లు తీవ్ర గాయాలతో కర్నూలు ఆస్పత్రిలో చేరారు. దీనిపై నాల్గో పట్టణ పోలీసులు కనీసం కేసు కూడా నమోదు చేయలేదు. అంతకు ముందు కూడా ఆర్టీఏ కార్యాలయం సమీపంలో ఖాళీ స్థలాల కోసం యత్నించి విఫలమైనట్టు తెలుస్తోంది.

హోటళ్లు..బార్‌లపై దాడులు : ప్రజాప్రతినిధిని.. తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాలో ఉన్నట్లు తెలిసింది. అందుకే తనకు ఒకరోజు రూము ఇవ్వలేదని అలెగ్జాండర్ హోటల్‌పై దాడి చేశారు. ఆ ఘటన మరువకముందే యువరాజ్ బార్ పై దాడికి దిగారు. బార్‌లో హార్డ్‌డిస్క్‌లు తీసుకెళ్లినట్టు బాధితులు చెప్పారు. స్వయానా టీడీపీ అనుకూల పత్రికల్లో దీనిపై వార్తలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రూపులతో రచ్చ.. : అనంతపురం అర్బన్ నియోజకవర్గ రాజకీయం రచ్చకెక్కింది. 2024 ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరికి టికెట్ ఇవ్వని కారణంగా వేరుకుంపటి పెట్టారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు, ప్రభాకర్ చౌదరికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. దీనికితోడు తాజాగా టీడీపీ నేత సుధాకర్ నాయుడు ఎమ్మెల్యేతో విభేదించారు. ఈ క్రమంలో అర్బన్ నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు రోజు రోజుకూ పెచ్చుమీరి పరిస్థితి చేయిదాటిపోయింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నగరం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఒకరకంగా చెప్పాలంటే గ్రూపు రాజకీయాలతో అల్లకల్లోలంగా తయారైందని కొందరు టీడీపీ నాయకులే విమర్శిస్తున్నారు.

జేఎల్‌ఎంకు విద్యుత్ షాక్


చికిత్స పొందుతున్న నారాయణస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని గంగవరం గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తూ జేఎల్‌ఎం నారాయణస్వామి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఓ రైతు తోటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం మరమ్మతులు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని ఫోన్‌లో మాట్లాడుతూనే స్తంభం పైకి ఎక్కాడు. అయితే విద్యుత్ లైన్‌కు మరో ఫీడర్ లైన్ క్రాస్ చేసి ఉండడంతో స్పార్క్ ఉత్పన్నమై షాక్‌కు గురయ్యాడు. ఎడమ చేతికి, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైతులు తొలుత కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఏఈ గంగాధర్ తెలిపారు.

ఆస్పత్రిలో టీకా లేదు - పౌష్టికాహారం ఇవ్వరు

- కలెక్టర్ వినోద్ కుమార్ వద్ద గోడు వెళ్లబోసుకున్న గర్భిణి


కలెక్టర్‌ను కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న గర్భిణి నీరజ

తాడిపత్రి రూరల్: దివ్యాంగురాలైన తాను ఐదు నెలల గర్భంతో ఉన్నానని, ఈ సమయంలో కీలకంగా అందజేసే టీకాలు కానీ, పౌష్టికాహారం కాని తనకు అందడం లేదంటూ కలెక్టర్ ఎదుట ఓ గర్భిణి వాపోయారు. ఈ మేరకు సోమవారం యాడికిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో బాధితురాలు మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా కడప నగరంలో నివాసముంటున్న నీరజ.. తన తల్లిదండ్రులు చనిపోవడంతో కొన్నేళ్ల క్రితం సజ్జలదిన్నెలోని అమ్మమ్మ ఇంటికి వచ్చేశారు. కూలి పనులతో జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో పని ప్రాంతంలో రోడ్డు దాటుతున్న సమయంలో లారీ ఢీకొనడంతో తన కుడి చేతిని కోల్పోయింది. కోలుకున్న అనంతరం ఓ ఉద్యోగికి ఇచ్చి వివాహం జరిపించగా కొన్ని రోజులకే సదరు ఉద్యోగికి తాను రెండో భార్యగా గుర్తించిన నీరజ తప్పని పరిస్థితుల్లో సర్దుకుపోయింది. ప్రకాశం జిల్లాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్నానంటూ భర్త అప్పుడప్పుడు వచ్చి వెళుతుండేవాడు. అంతకు మించి కుటుంబ బాగోగులను ఆయన పట్టించుకునేవాడు కాదు. వీరి దాంపత్య జీవనానికి గుర్తుగా మూడేళ్ల వయసున్న ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణి. గర్భస్థ శిశువు ఆరోగ్యం కోసం తాడిపత్రిలోని ఆస్పత్రికి వెళితే ఆధార్ కార్డు లేకపోవడంతో కనీస టీకాలు కూడా అందలేదు. పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వెళితే.. ఆధార్ కార్డు, మాతా శిశు సంరక్షణ కార్డు(ఎంటీసీటీసీ) పుస్తకం ఇవ్వాలంటున్నారు. అవి రెండూ తన వద్ద లేకపోవడంతో తలెత్తిన ఇబ్బందులపై సోమవారం కలెక్టర్‌కు వివరించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

కూటమి పాలనంతా మోసమే

- కుట్రలతో జగనన్నపై ఉన్న ప్రజాభిమానాన్ని ఆపలేరు
- 'చంద్రబాబు మోసం' పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి శైలజనాథ్


పార్టీ నాయకులతో కలసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శైలజనాథ్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి పాలన మొత్తం మోసాలతోనే సాగుతోందని, సంక్షేమమనేది మటుమాయమైందని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని సోమవారం శింగనమలలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అంతకు ముందు రామాలయంలో పుస్తకావిష్కరణ జరగాల్సి ఉండగా.. అనుమతులు లేవంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసుల తీరుపై శైలజనాథ్ మండిపడ్డారు. అనంతరం కల్యాణ మంటపానికి వేదిక మార్చారు. ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రజాదరణ, ఉనికిని చూసి టీడీపీ నాయకులు భయపడుతున్నారన్నారు. దీంతో పోలీసులను అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను అడ్డుకునే కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. ఏడాది పాలనలో ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా విధ్వంసాలకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీను కూడా పక్కాగా అమలు చేయని అసమర్థ స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనపై ప్రజలను చైతన్య పరిచేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా ఎంత మందిని జైళ్లలో పెట్టించినా భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు యోగీశ్వరి, వెంకటనారాయణ, భూమిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీలు నీలం భాస్కర్, భోగాతి ప్రతాపరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్‌లు రఘునాథ్‌రెడ్డి, బాలకృష్ణ, నాగేశ్వరరావు, గువ్వల శ్రీకాంతరెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, శ్రీరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

టీచర్ కిడ్నాప్ కేసులో వీడిన మిస్టరీ

- పథకం ప్రకారం కిడ్నాప్ చేసిన కుటుంబ సభ్యులు
- 11 మంది నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: మూడు రోజుల క్రితం కిడ్నాప్‌నకు గురైన ఉపాధ్యాయురాలి కేసులో మిస్టరీ వీడింది. కుటుంబసభ్యులే పథకం ప్రకారం ఆమెను కిడ్నాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించి, నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం కళ్యాణదుర్గం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ రవిబాబు, సీఐ నీలకంఠేశ్వర్ వెల్లడించారు. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన మారుతమ్మ... కంబదూరు మండలం కూరకులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మారుతమ్మకు పెళ్లి చేస్తే కుటుంబపోషణ భారమవుతుందని భావించిన కుటుంబ సభ్యులు వచ్చిన సంబంధాలను పథకం ప్రకారం చెడగొడుతూ వచ్చేవారు. ఈ క్రమంలో తన స్వగ్రామానికి చెందిన ఎర్రిస్వామితో అయిన పరిచయం కాస్త ప్రేమకు దారి తీయడంతో ఇటీవల ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఇది గిట్టని కుటుంబ సభ్యులు ఎలాగైనా ఇద్దరినీ విడగొట్టాలని భావించారు. ఇందులో భాగంగా ఈ నెల 12న విధులు ముగించుకుని భర్తతో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బొలెరో వాహనంలో వచ్చిన 11 మంది కుటుంబసభ్యులు అటకాయించి మారుతమ్మను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. విషయాన్ని వెంటనే ఎర్రిస్వామి కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

ఆస్తి కోసం మట్టుబెట్టే ప్రయత్నం


అనంతపురంలో విలువైన స్థలం మారుతమ్మ పేరుపై ఉంది. అలాగే బంగారు నగలు కూడా పెద్ద మొత్తంలో ఉన్నాయి. తమను కాదని ఆమె ఎర్రిస్వామిని పెళ్లి చేసుకోవడంతో ఆస్తితో పాటు ఆమె సంపాదన మొత్తం అతనే అనుభవిస్తాడనే అక్కసు మారుతమ్మ కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీంతో మారుతమ్మను పథకం ప్రకారం కిడ్నాప్ చేసి బెంగళూరులోని బంధువు ఇంటికి తరలించారు. ఆస్తితో పాటు బంగారు నగలు స్వాధీనం చేయాలంటూ చిత్రహింసలకు గురి చేశారు. ఎర్రిస్వామిని వదిలేసి వివాహితుడైన తమ బంధువులోని ఓ అబ్బాయిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు. అయితే మారుతమ్మ తలొగ్గకపోవడంతో చివరకు హతమార్చాలని తల్లిదండ్రులు భావించారు. విషయం తెలుసుకున్న మారుతమ్మ చాకచక్యంగా వ్యవహరించారు. 'మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటా'నంటూ నమ్మబలికారు. దీంతో ఆదివారం బెంగళూరు నుంచి స్వగ్రామానికి బొలెరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం కళ్యాణదుర్గం శివారులోకి చేరుకోగానే అప్పటికే అక్కడ వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు బొలెరోను అటకాయించి పరిశీలించారు. అందులో మారణాయుధం లభ్యం కావడంతో అనుమానంతో పీఎస్‌కు తరలించి, విచారణ చేపట్టారు. అదే సమయంలో మారుతమ్మ తనపై కుటుంబసభ్యులు సాగించిన కుట్రలు వివరించడంతో విషయం కాస్త బయటపడింది. మారుతమ్మ ఫిర్యాదు మేరకు ఆమె కుటుంబసభ్యులైన ఆనంద్, శ్యామలమ్మ, విశాఖ, ఎల్లప్ప, మహాలక్ష్మి, అంకాలప్ప, మహేష్, రమేష్, వన్నూరుస్వామి, మహేంద్ర, బాబుపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఏడీసీఏ జిల్లా సెక్రటరీ భీమలింగారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియం వేదికగా నిర్వహించిన సౌత్ జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేతగా నెల్లూరు జట్టు నిలిచింది. సోమవారం అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌ను ఎంచుకున్న అనంతపురం జట్టు 48.5 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మచ్చా దత్తారెడ్డి 58 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 43, మహేందర్‌రెడ్డి 58, రాజకుళ్లాయప్ప 44 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన నెల్లూరు జట్టు 9 వికెట్ల నష్టానికి 49.4 ఓవర్లలో 296 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో రేవంత్‌రెడ్డి 104 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్సర్‌తో 88 పరుగులు సాధించాడు. పాయింట్ల టేబుల్‌లో 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన నెల్లూరు జట్టును విజేతగా ప్రకటిస్తూ ట్రోఫీని ఏడీసీఏ సెక్రటరీ వి.భీమలింగారెడ్డి అందజేశారు.

కార్మికులకు ఎగనామం



- పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం ఎగ్గొట్టిన ప్రభుత్వం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో పారిశుధ్య కార్మికుల పిల్లలకూ అమ్మఒడి వర్తింపు
- ప్రస్తుత ప్రభుత్వ తీరుపై కార్మికుల ఆగ్రహం
- పథకాలు అమలు చేయాలని డిమాండ్



కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందిస్తున్న మునిసిపల్ కార్మిక సంఘాల నాయకులు



తల్లికి వందనం అర్హుల జాబితాపై ఆరా తీస్తున్న లబ్ధిదారులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలకు ముందు అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని అందిస్తాం. సూపర్ సిక్స్‌తో ఆర్థిక స్థితిగతులను మెరుగు పరుస్తామంటూ చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్ చేసిన మాటలు నీటి మూటలయ్యాయి. కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థలోని పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వేధిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదట్లో నగరపాలక సంస్థ కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు కాలేదు. అప్పటి స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రేషన్ కార్డులను మంజూరు చేయించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. దీంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరపాలక సంస్థ కార్మికులకు పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకున్నారు. ఏటా అమ్మఒడితో పాటు వివిధ పథకాలకు కార్మికులు అర్హత సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

కూటమిలో కోతలు..

నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు అలా ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ డబ్బు ఇస్తామని చంద్రబాబు నాయుడు అండ్ కో ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది తల్లికి వందనం అమలు చేయలేదు. ఏడాది దాటిన తర్వాత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.13 వేలు అరకొరగా అందిస్తోంది. అందులో నగరపాలక సంస్థ కార్మికులను మినహాయించారు. నగరపాలక సంస్థలో మొత్తం 409 మంది (అప్కాస్) కార్మికులు ఉన్నారు. కాగా వీరిని తల్లికి వందనం వర్తింపజేయలేదు. దీంతో కార్మిక సంఘాలు, కార్మికులు ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. గత ప్రభుత్వంలో పథకాలు అందేవని గుర్తు చేసుకుంటున్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు మంచి వేతనాలు అందిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని కార్మికులు చెబుతున్నారు. పథకాలు వర్తింపజేయక పోవడంతో కూటమి ప్రభుత్వం తీరును తప్పుబడుతున్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజారోగ్యం కోసం పాటుపడే కార్మికులకు తల్లికి వందనం పథకం మంజూరు చేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకలు గోపాల్, తదితరులు సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కార్మికులు పని చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తల్లికి వందనం వర్తింపజేశారన్నారు. సూపర్ సిక్స్ అని అధికారంలోకి వచ్చి ఈరోజు పారిశుధ్య కార్మికులకు కోత విధించడం సరికాదన్నారు. తక్షణం అన్ని పథకాలకు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు.

సరైన పద్ధతి కాదు



మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో 7వ తరగతి చదివే సాయికిరణ్‌కు అమ్మ ఒడి వచ్చేది. ఆ డబ్బుతో ఇద్దరు పిల్లలు జ్ఞానేశ్వర్, సాయికిరణ్ చదువుకు వినియోగించే వాళ్లం. పైసా ఖర్చు లేకుండా పిల్లలను బాగా చదివించుకునే వాళ్లం. ఇప్పుడు కార్మికులకు ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఇలాగైతే ఎలా సార్. మా అత్త నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి ప్రజలకు సేవ చేస్తున్నారు. గతంలో అమ్మఒడి తీసుకునే వాళ్లం. ఇప్పుడు పక్కన ఉంచితే ఎలా? ఇది సరైన పద్ధతి కాదు. – బాల కుళ్లాయమ్మ, రాణీనగర్

ఇంత దారుణమైతే ఎలాగయ్యా?



మాలాంటి పేదోళ్లకు బాగా ఉండేది. ఇప్పుడు మునిసిపల్ కార్మికులకు పథకాలు అందకుండా చేస్తున్నారు. లబ్ధిదారుల జాబితాలో నుంచి పేర్లు తీసేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది తల్లికి వందనం సొమ్ము ఇవ్వలేదు. ఈ ఏడాది పథకాలకు కొర్రీలు పెట్టి డబ్బు జమ చేయకుండా మోసం చేస్తున్నారు. ఇంత దారుణమైతే ఎలాగయ్యా? దయచేసి మాలాంటి పేద వారికి తల్లికి వందనం వర్తింపజేయండి. – కృపమ్మ, పారిశుధ్య కార్మికురాలు, అంబేడ్కర్ నగర్

సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు



పిల్లలకు డబ్బు జమ కాలేదని చెబుతున్న తల్లిదండ్రులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద అరకొరగా సాయం మంజూరు చేసింది. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తప్పులతడకగా ఉండటంతో అర్హులైన తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నగరంలోని 74 సచివాలయాలకు అర్హులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వినాయ కనగర్, భాగ్య నగర్, రాణీనగర్, అంబేడ్కర్ నగర్, శ్రీనివాస్ నగర్, వేణుగోపాల్ నగర్, బుడ్డప్ప నగర్, నవోదయ కాలనీ తదితర ప్రాంతాల సచివాలయాలు జనంతో కిక్కిరిసిపోయాయి. తమకెందుకు తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో వెల్ఫేర్, అడ్మిన్ తదితర సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. గతంలో తమకు పథకం వర్తింపజేసే వారని.. ఇప్పుడు వివిధ కారణాలను చూపి ఏ విధంగా తొలగిస్తారని సిబ్బందిని నిలదీశారు. ప్రభుత్వం తొలగిస్తే తామేమి చేస్తామంటూ సచివాలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. తల్లులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి, శాపనార్థాలు పెట్టారు. ఇప్పటికే తల్లికి వందనం అందిస్తామని చెప్పి ఏడాది తర్వాత విచారణ పేరుతో జాప్యం చేస్తే ఎలాగని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

యోగా సాధనకు హాజరు కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న యోగా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక లక్ష్మీ పండమేటీ రాయుడు ఆలయం వద్ద యోగా సాధనకు ఏర్పాటు చేసిన వేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉదయం 6 గంటలకే అధికారులందరూ లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయం వద్దకు రావాలన్నారు. అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివ ప్రసాద్, ఏపీఎం సునీత, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న మాంటిస్సోరి కళాశాల యాజమాన్యం

రాప్తాడు: గొల్లపల్లిలోని మాంటిస్సోరి కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రభంజనం సృష్టించారు. కళాశాల స్థాపించిన రెండేళ్లలోనే దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి తమ కళాశాలను అగ్రస్థానంలో నిలిపారని ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన హాసిని, సుజన్, రితేష్, హర్ష, చరణ్ తదితర విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన అనతి కాలంలోనే జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌లో ఇలాంటి అద్భుత ఫలితాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందించి భవితకు గొప్ప బాట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి, కళాశాల ఇన్‌చార్జ్ మధు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు చేయూత



కృష్ణవేణికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఉద్యోగ విరమణ పొందిన మహిళా హోంగార్డు కృష్ణవేణికి చేయూత అందించేందుకు హోంగార్డులంతా ముందుకొచ్చారు. ఒక రోజు గౌరవ వేతనం చెల్లించడం ద్వారా సేకరించిన రూ.4,33,200 చెక్కును సోమవారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా కృష్ణవేణికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు పవన్ కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్, షాపులకు టెండర్ల ఆహ్వానం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని జన్మభూమి క్యాంటీన్, షాపులకు టెండర్లు ఆహ్వానించినట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.మధుసూదన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఎస్కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

'కూటమి ప్రభుత్వంలో చట్టాల నిర్వీర్యం'

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో చట్టాలను నిర్వీర్యం చేశారని జైభీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీర నాగరాజు, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. పది రోజుల క్రిందట రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో మైనర్ బాలికపై 18 మంది అత్యాచారం చేసి గర్భవతిని చేశారన్నారు. ఆ సంఘటన మరువకనే అనంతపురంలో గిరిజన విద్యార్థిని ప్రేమ పేరుతో నమ్మించి కిరాతకంగా హత్య చేశారని తెలిపారు. ఈ ఘటనలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అనంతపురం రూరల్ పరిధిలోని నారాయణపురంలో ఓ మైనర్ బాలికపై వృద్ధుడు అత్యాచారం చేసి గర్భవతిని చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో అత్యాచారాలు, హత్యలు చేసినా కఠిన చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధులు కూడా వీటిపై నోరు విప్పాలన్నారు. లేదంటే రాబోవు రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

అమరావతి ఆస్పత్రిపై చర్యలకు డిమాండ్

అనంతపురం: నగరంలోని అమరావతి ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ జగదీష్‌కు ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్ సంగాల సుదర్శన రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్పీని కలిసి వినతి పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. బాధితుడు తెలిపిన మేరకు.. అనంతపురంలోని ఆదర్శ నగర్‌లో నివాసముంటున్న సుదర్శనరెడ్డి ఈ ఏడాది ఆగస్టు 14న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న సమయంలో వీధి కుక్కలు అడ్డు రావడంతో కిందపడి గాయపడ్డాడు. దీంతో వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్లిపోయాడు. నొప్పి తగ్గకపోవడంతో అదే నెల 17న అమరావతి ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాడు. అక్కడి వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ చేయించిన అనంతరం శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. అయితే తాను బెంగళూరుకు వెళ్లి సర్జరీ చేయించుకుంటానని బాధితుడు తెలిపితే స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉండడంతో బెంగళూరు నుంచి డాక్టర్ ఇక్కడికే వచ్చి ఆపరేషన్ చేస్తాడని, అన్నీ తామే చూసుకుంటామని ఒప్పించి సెప్టెంబర్ 15న సర్జరీ చేశారు. అదే నెల 18న డిశ్చార్జ్ చేశారు. వైద్యుల సూచన మేరకు నాలుగు రోజుల అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాడు. మోకాలు వాపు ఉందని, నొప్పి కూడా తగ్గలేదని తెలపడంతో వాపు ఆరువారాల పాటు ఉంటుందని, సర్జరీ చేశాక వాపు సహజమేనని వైద్యులు నచ్చచెప్పి పంపారు. అయితే నొప్పి తీవ్రత అధికం కావడంతో అక్టోబర్ 5న మోకాలు వాపు ఆరు వారాలు ఉంటుంది. సర్జరీ చేశాక వాపు సాధారణమే అని డాక్టర్లు పేర్కొన్నారు. నయం కాకుండా నొప్పి అధికం అయింది. బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించాడు. అక్కడ మరోసారి సర్జరీ అయింది. అమరావతి ఆస్పత్రిలో చేసిన సర్జరీ సక్రమంగా లేకపోడంతో తనకు రూ.30 లక్షల వరకు ఖర్చు వచ్చిందని నిర్వాహకులను కలసి వివరిస్తే తప్పిదాన్ని సరిదిద్దుకుంటామని ఇప్పటి వరకూ పట్టించుకోలేదని, తనను, తన కుటుంబాన్ని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీకి బాధితుడు ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీనివాసులు, రేపాటి రామాంజినేయులు, ప్రకాష్, షఫీవుల్లా, కేశవ్, హనుమంతు, రాజారెడ్డి, నాగేంద్ర, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువ పనులు ఆపాలి

గార్లదిన్నె(శింగనమల): ప్రభుత్వం వెంటనే హంద్రీ–నీవా కాలువ పనులు ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 16న శింగనమల తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేసినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. అలాగే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపి , హంద్రీ–నీవా కాలువ కాలువను పదివేలు క్యూసెక్కులతో వెడల్పు చేయాలన్నారు. హెచ్ఎల్‌సీకి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, మండల కమిటీ రంగన్న, శంకరన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'వేదిక మార్పు'పై మారని అధికారుల తీరు

- ప్రకటనకే పరిమితం చేసిన వైనం
- కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు



కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలను వెనక్కి పంపిస్తున్న ఏఎస్ఐ నారాయణ నాయక్

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మార్పు సమాచారం ప్రజలకు పూర్తిస్థాయిలో చేరవేయడంలో అధికారుల తీరు మారడం లేదు. సోమవారం ఇదే పరిస్థితి కనిపించింది. కలెక్టరేట్‌లో నిర్వహించే పరిష్కార వేదిక కార్యక్రమం యాడికి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమాచారం పత్రిక ప్రకటనకే సరిపెట్టారు. ఈ విషయం తెలియక అర్జీలు సమర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చారు. పరిష్కార వేదిక కలెక్టరేట్‌లో కాకుండా యాడికిలో జరుగుతోందని వన్‌టౌన్ ఏఎస్ఐ నారాయణనాయక్, కలెక్టరేట్ సెక్యూరిటీ గార్డ్ రాఘవేంద్ర చెప్పడంతో వచ్చిన ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురై వెనుతిరిగారు.

సమాచారం చేరవేయాలి

వేదిక మార్పు చేసిన క్రమంలో కేవలం ప్రకటనతో సరిపెట్టకుండా సమాచారం గ్రామస్థాయికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓ), గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు (వీఆర్ఏ), పంచాయతీ కార్యదర్శులు ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు సమాచారం చేరేలా చూడాలి.

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: 'కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలపై అత్యాచారాలు, దాడులు నిత్యకృత్యం అయ్యాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అరచి గోలపెట్టిన పవన్ కళ్యాణ్‌కు ఇప్పుడు జరుగుతున్నవి కనపడలేదా..? ఇక రాష్ట్ర హోంమంత్రి మహిళ అయి ఉండి ఏం ప్రయోజనం.' అంటూ ఏపీ మహిళ సమాఖ్య నాయకురాళ్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలు, అమ్మాయలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి పార్వతిప్రసాద్, పద్మావతి మాట్లాడుతూ.. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై 14 మంది అత్యాచారం చేయడం అత్యంత పాశవిక చర్య అన్నారు. ఇక ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, అంతకు ముందుకు హిందూపురంలో అత్తాకోడళ్లపై అత్యాచారం.. తాజాగా కర్నూలులో మైనర్ బాలికపై అత్యాచారం... ఇలా ప్రతి రోజూ ఏదో ఒక చోట అచారక అమానవీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలు, మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు కనిపించడం లేదా పవన్ కళ్యాణ్ అంటూ నిలదీశారు. ఏ ఒక్క ఘటనలోనైనా బాధితులను పరామర్శించావా అని ప్రశ్నించారు. అత్యాచార ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాల్సింది పోయి అధికార పార్టీ నాయకులకు అండగా నిలుస్తుండటం హేయమన్నారు. దోషులను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు యశోదమ్మ, జానకి, లక్ష్మిదేవి, లీలావతి, శ్యామల, సునీత, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

అనంతపురం: నగరంలోని సెవెన్స్ హిల్స్ కాలనీకి చెందిన షేక్ దాదా ఖలందర్‌కు (60) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా పోయింది. గతేడాది డిసెంబర్ 27న ఇల్లు వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఇతను అనంతపురంలో సంచరిస్తున్నాడని సమాచారం. ఆచూకీ తెలిసిన వారు టూ టౌన్ సీఐ ఫోన్ నంబర్ 9440796806కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీకాంత్ యాదవ్ సూచించారు.

ప్రమాదంలో వృద్ధుడి మృతి

అనంతపురం: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నగరంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న బ్రహ్మాచారి (78) మందులు కొనుగోలు చేసి, పాతూరులోని పవర్ ఆఫీస్ వద్ద వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బ్రహ్మాచారిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన సోమవారం మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో పాటు ఉడాయించాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



అధికారుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

ఇష్టారాజ్యం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పుడు ముందుండాలని స్వాక్షాత్తు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు జారీ చేసినా ఆత్మకూరు మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమస్యలను చెప్పుకునేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు.. కార్యాలయం వద్ద అధికారుల కోసం పడిగాపులు కాశారు. అర్జీలను ఎవరికి ఇవ్వాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్జీలను తీసుకునేందుకు ఒక్క అధికారి కూడా కార్యాలయంలో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – ఆత్మకూరు:

సర్వర్ డౌన్..

- రైతు సేవా కేంద్రాల్లో ఈ–కేవైసీకి అవస్థలు

అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈ–కేవైసీ చేయించుకునేందుకు అన్నదాతలు రైతు సేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. సోమవారం రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో సర్వర్ మొరాయించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ నాడు ఇలా కార్యాలయాల వద్ద పడిగాపులు కాయలేదని రైతులు వాపోతున్నారు. వైఎస్ జగన్ పాలనలో ఇబ్బందులు పడలేదని చెబుతున్నారు. ఇక రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇవ్వడం, ఈ–కేవైసీ చేయడం కష్టంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. – రాప్తాడు/ఆత్మకూరు:



రాప్తాడులో ఈ–కేవైసీకి బారులుతీరిన దృశ్యం



నడిరోడ్డుపై ఆగిన ప్రభుత్వ వాహనం

అనంతపురం నుంచి రాయదుర్గానికి సోమవారం విద్యుత్ శాఖకు చెందిన ఐచర్ వాహనం సామగ్రితో బయలుదేరింది. ఆత్మకూరు మండలం పంపనూరు వద్దకు రాగానే వాహనంలో డీజిల్ అయిపోవడతో నడిరోడ్డుపై ఆగిపోయింది. డ్రైవర్ ద్విచక్ర వాహనంలో వెళ్లి డీజిల్ తీసుకొచ్చాడు. అంత వరకు ఆ వాహనం రోడ్డుపై నిలబడిపోయింది. ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ వాహనాలకు డీజిల్ సరిగా వేయించుకోలేరా అంటూ ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. – ఆత్మకూరు: